





వీరభద్రస్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు, బంగారుకిరీట అలంకరణలో వీరభద్రస్వామి

శివోహం

పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగిన శివాలయాలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- దేవస్థానాల కమిటీల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి8 : శివనామ స్మరణతో శివాలయాలు హోరెత్తాయి. హరహర మహాదేవ.. శంభోశంకర నాదంతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లాయి. మహబూబాబాద్ జిల్లాలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి పర్వదినం రోజున పరమేశ్వరుడిని దర్శించుకుని కల్యాణాన్ని వీక్షిస్తే శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

మానుకోట జిల్లా కేంద్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు రంగావఝ్ఝల సుధాకరశాస్త్రి, చిట్టా శ్రీకాంత్‌శాస్త్రి వేదమంత్రోచ్చరణల నడుమ ఉదయం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు రుద్రాభిషేకం, 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన పూజా వేడుకలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలో ఈవో భిక్షమాచారి పాల్గొన్నారు. శ్రీభక్తమార్కండేయ దేవాలయంలో ప్రధాన అర్చకుడు కొత్తూరి నరసింహమూర్తి మంత్రోచ్చరణల నడుమ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ బాధ్యులు ముల్క కృష్ణమూర్తి, కట్ట యాదగిరి, పుల్లయ్య పాల్గొన్నారు. శ్రీఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడు యుగంధర్‌శర్మ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అర్చకుడు తాటిపాముల శివకృష్ణశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు, 108 బిందెలతో పంచామృతాభిషేకం నిర్వహించగా ఆలయ ట్రస్టు చైర్మన్ పమ్మిసనాతనాచారి, మాధవాచారి, మోత్కూరి శంకర్, ధనుం జయాచారి, నాగమణి పాల్గొన్నారు. శ్రీమహాగాయత్రీదేవి ఆలయంలో అర్చకుడు వంకోజు జలేంద్రాచార్యుల నేతృత్వంలో శివుడికి రుద్రాభిషేకం, కాలభైరవ స్వామికి పంచామృతాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు.

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు బుక్కమఠం నవీన్ దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. మరిపెడ విలేజ్‌లోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో లోక కల్యాణంకై ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ అర్చకులు

మిగతా 8వ పేజీలో



మహబూబాబాద్ శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

హరహర మహాదేవ.. శంభోశంకర

- వీరభద్ర నామస్మరణతో హోరెత్తిన కురవి
- ఉదయం నుంచే పోటెత్తిన భక్తులు



వీరభద్రస్వామి, భద్రకాళిమాతల ఉత్సవ విగ్రహాలను పెళ్లి కొడుకు, పెళ్లికూతురు చేసేందుకు తీసుకువస్తున్న అర్చకులు

కురవి, మార్చి 8 : మహా శివవరాత్రి పర్వదినమైన శుక్రవారం ప్రముఖ శైవక్షేత్రమైన కురవి వీరభద్రస్వామి ఆలయం వీరభద్ర నామస్మరణతో హోరెత్తింది. శివునికి ప్రీతిప్రదమైన శివరాత్రి రోజున ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కటాక్షం కోసం, కోరిన కోర్కెలు తీరాలని భక్తులు పానరసం పడుకున్నారు. పిల్లలకు పుట్టువెంట్రుకలు తీయించేందుకు భక్తులు బారులు తీరారు. కోడెలను ఆలయం చుట్టూ తిప్పుతూ భక్తజనం మొక్కులు తీర్చుకున్నారు. తాగునీటికి ఇబ్బంది కలుగకుండా దేవస్థానం అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. మానుకోటకు చెందిన శ్రీలక్ష్మిగణపతి సేవాట్రస్ట్ సభ్యులు ఆలయంలో స్వచ్ఛందంగా సేవలు అం దించారు. జాతర పురస్కరించుకుని వందల సంఖ్యలో బొమ్మలు, గాజులు, కొబ్బరి కాయలు సహా వివిధ దుకాణాలు వెలిశాయి. మహ బూబాబాద్ ఎస్పీ సుదీర్‌రాంధాన్ పర్యవేక్షణలో నలు గురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 28 మంది ఎస్సైలు మొత్తం 270 మంది సిబ్బందితో భద్రతాచర్యలు చేపట్టారు. జాతరలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎస్సై గోపి, ఎంపీడీవో వీరబాబు, ఈవోపీఆర్డీ విజయ, కార్యదర్శి దివాకర్, దగ్గరుండి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు..

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోట్ రాంచంద్రునాయక్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు సాదరస్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, ఎర్ర నాగేశ్వర్‌రావు, ఎస్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, సక్రు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్, ఎంపీ కవిత

ఎంపీ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి, ఎమ్మెల్యే...

మహాశివరాత్రి పురస్కరించుకుని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మహబుబాబాద్ ఎంపీ మాలోత్ కవిత వేర్వేరుగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ, ఎంపీవెంట జడ్పీ చైర్మన్ బిందు, జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, ఐలు నరహరి, గుగులోత్ నెహ్రూ, తోట లాలయ్య, జి.రాంచంద్రయ్య, గుగులోత్ రవి, తదితరులు ఉన్నారు. మహబుబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బి.శంకర్‌నాయక్ వీరభద్రస్వామి సన్నిదిలో ప్రత్యేక పూజలు జరిపారు.

రాత్రి ఎదురుకోలుతో ..

కురవి, మార్చి 8 : అంకురార్పణతో గురువారం సాయంత్రం ప్రారంభమైన కురవి జాతరలో జనజాతర కొనసాగుతుంది. శుక్రవారం శివరాత్రి రోజున ఉదయం ప్రారంభమైన పూజలు రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఉదయం 4 నుంచి 11 గంటల వరకు పూర్ణాభిషేకం, 12 గంటల నుంచి వీరభద్రస్వామి దర్శనం సాయంత్రం వరకు కొనసాగింది. రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామసేవ, పెళ్లికొడుకు వీరభద్రస్వామి, పెళ్లికూతరు భద్రకాళి అమ్మవారు వైపు కొందరు గ్రామస్తులు ఉండి చలోక్తులు విసురుకునే కార్యక్రమం ఆకట్టుకుంది. ఎదుర్కోలు కార్యక్రమం వద్ద గ్రామస్థులు చేపట్టిన కాగడాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్ పాల్గొన్నారు. మొత్తం మీద మహాశివరాత్రి రాత్రి కురవిలో జనజాతర కొనసాగుతుంది.

మళ్లీ బలరాముడే..

- మానుకోట లోకసభ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- మహబూబాబాద్ నుంచి నాలుగోసారి బరిలో..
- ప్రకటించిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్



మహబూబాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశమై 8 రాష్ట్రాల నుంచి ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా, తొలి జాబితాలో నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయకత్వంలో పార్టీ కేం ద్రఎన్నికల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

నాలుగోసారి..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ములుగు జిల్లాలోని మారుమూల మదనపల్లె గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు పోరిక లక్ష్మీబాయి-లచ్చునాయక్‌లకు నాలుగో సంతానంగా 1964 జూన్ 6న జన్మించిన బలరాంనాయక్.. 2009లో రాజకీయంగా ఆరంగేట్రం చేశారు. అప్పట్లో జాతీయస్థాయిలో జరిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంటరీ స్థానం నుంచి తొలిసారి కాంగ్రెస్ తరుఫున పోటీచేసి సమీప మహాకూటమి సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాస్‌రావుపై 68,957 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే క్రమంలో పార్లమెంట్ లేబర్ కమిటీలో సభ్యుడిగా, బొగ్గు, విమానయానశాఖ, రైల్వేశాఖ కన్సల్టేషన్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఆపై జరిగిన యూపీఏ మంత్రివర్గ విస్తరణలో సామాజికవర్గ సమీకరణలు కలిసి రాగా, కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయమంత్రి పదవి లభించింది. 2014, 2019లలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. అంతకు ముందు 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓటమి చవిచూశారు. తిరిగి రానున్న 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు నేరుగా టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వారి సంఖ్య 50 వరకు ఉండగా అధిష్ఠానం తిరిగి పోరిక బలరాంనాయక్‌కే టికెట్ ఖరారు చేసింది.

పోరిక బలరాంనాయక్ ప్రొఫైల్ :

పేరు	: పోరిక బలరాంనాయక్
పార్టీ	: కాంగ్రెస్
పదవి	: కేంద్ర మాజీ మంత్రి
విద్యార్హత	: ఎంఏ
పుట్టిన తేదీ	: 06-06-1964
భార్య	: తిరుపతమ్మ
పిల్లలు	: సాయిశంకర్, సాయికిరణ్
తల్లిదండ్రులు	: పోరిక లచ్చునాయక్-లక్ష్మీబాయి
స్వగ్రామం	: మదనపల్లి (ములుగు మండలం)
పరిచయం	: బలరాంనాయక్ హైదరాబాద్ ఏపీఎస్పీ పోలీస్ ఉద్యోగంలో పని చేశారు. ఆ తర్వాత సెక్రటేరియట్ టెలికామ్ ఉద్యోగిగా చేరారు. మరోపక్క ఆలిండియా బంజారా సేవక్ సమాజ్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నుంచి పోటీచేసి గెలిచి కేంద్ర సహాయమంత్రి పదవిని అధిష్ఠించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీచేసి పరాజయం పాలయ్యారు. మరో మారు అక్కడి నుంచే ఎంపీగా పోటీచేసి, ఓటమిని చవిచూశారు.

కమలం గూటికి సీతారాంనాయక్



- ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మహబూబాబాద్ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ
- బీఆర్ఎస్‌లో గౌరవం లేదు, బీజేపీలో చేరికపై త్వరలో ప్రకటిస్తా : సీతారాం

6



విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి


గిరిజనులకు అత్యున్నత విద్య


- ఈ ఏడాది నుంచే జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు
- తొలుత బీఏ ఇంగ్లీష్, బీఏ సోషల్ సైన్స్ కోర్సులు
- గిరిజనులకు 33 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు
- డీపీఆర్, టెండర్లు పూర్తయితే భూమిపూజకు ప్రధాని మోదీ రాక
- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి
- జాకారం వైటీసీలో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం

వివరాలు 8లో..

ఘనంగా మహిళా దినోత్సవం

- వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి సన్మానం
- ఆస్పత్రుల్లో గర్భిణీలకు పాలు, పండ్ల పంపిణీ
- గార్లలోని ఐద్వా ఆధ్వర్యంలో వేడుకలు





శనిగపురంలో మహిళలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, మరిపెడ విలేజీలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 8 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ సర్కార్ అనేక పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బానోత్ హరిసింగ్, భూక్య శ్రీను, ఎల్లండి వెంకట్‌రెడ్డి, బానోత్ ప్రసాద్, ఆవుల సతీష్, పింద్రాల రాందాసు, చిరంజీవి పిల్లి కృష్ణ, రవీందర్‌రెడ్డి, యాకయ్య, భాస్కర్, శక్క, పద్మం ఉపేంద్రమ్మ, మాధవి, నారోజు సత్యమనోరమ, విజయలక్ష్మి, స్వర్ణలత, గుగులోతు దేవి, సమ్మక్క, స్వాతి, ఉపేంద్ర, సులోచన, పాల్గొన్నారు.

- వికాస్ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులు ఎస్.జ్యోతిరాణి, పి.శ్రీలత (ఆర్టీసీ), బి.పార్వతి, టి.పద్మ (రైల్వే), ఐ.సుజాత, కె.తులసమ్మ (మునిసిపాలిటీ), కె.అండాలు, జి.హేమా (ఐసీడీఎస్), రమ, ఎ.సునిత, ఎస్కే.ఆసియానాశ్రీన్ (విద్య), జి.విజయకుమారి, జి.జ్యోతి (వైద్యరంగం)లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొడాలి నాగేంధర్‌రావు మాట్లాడుతూ.. మహిళలు గౌరవించబడ్డ సమాజమే అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గూడూరు నాగేశ్వర్‌రావు,వేమిశెట్టి కిషోర్‌కుమార్, డాక్టర్ డోలి సత్యనారాయణ, బిక్కి వెంకటేశ్వర్లు, తోర్నాల నగేష్‌కుమార్, పి.సదానందం, బొల్లం శ్రీనివాస్, సాదు మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో గూడూరు జడ్పీటీసీ గుగులోతు సుచిత్రబాలునాయక్ కేక్ కట్‌చేసి మహిళలకు పంపిణీ చేశారు. ప్రపంచంలో మహిళా సృష్టి, ప్రాముఖ్యత గొప్పదని చెప్పారు.
- మహబూబాబాద్ మండలం అమనగల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇస్లావత్‌బిచ్చాట్రస్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, నాగలక్ష్మి, ఏఎన్ఎంలు విజయ, శారద, గ్రామపంచాయతీ స్వపర్ సువమ్మ, సమాజ సేవకులు విజయ, రోజాను సన్మానించారు. టీడీపీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు, వైస్ ఎంపీపీ ఎల్తి మల్లయ్య, ట్రస్టు చైర్మన్ బి.హరికిషన్, బాలాజీ, మోహన్, సుధాకర్, సురేష్, సునిత, భారతి, కాళీ పాల్గొన్నారు.
- ముత్యాలమ్మగూడెం గిరిజనబాలికలఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ, మానుకోట సీనియర్ సివిల్ జడ్జీ సురేష్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని తెలిపారు. అదే విధంగా చట్టాలపై అవవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు మొగలయ్య, సఖీ కేంద్రం అడ్మిన్ శ్రావణి, లీగల్ అడ్వైయిజర్ ఉషా, భరోసా లీగల్ అడ్వైయిజర్ హాసిని పాల్గొన్నారు.
- పట్టణంలోని మందకొమురమ్మనగర్‌లో ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు గుగ్గి ళ్ల పీరయ్య, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎమ్డీ. రజియా, రామారాజు పద్మ, గుండెల సరిత, భూక్య శైకా, తప్పెట్ల సౌమ్య, స్వరూప, బాలమ్మ పాల్గొన్నారు.
- గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రీనా గోపికృష్ణ, రజిత మాధవ్, కమ్మగాని కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు హరిప్రసాద్, రఘు, ఉపేందర్, వీరన్న, అశోక్, స్వాఇ, రాధిక, జ్యోత్స్న, సరస్వతి, చైతన్య, ప్రభావతి, మమత, తేజస్విని పాల్గొన్నారు.
- మరిపెడ విలేజ్‌లో బాలవికాస ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కోర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర, జుజ్జూరి ఉపేంద్ర, డొంకెన ఉపేంద్ర, సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

'13 నుంచి మరికొన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం'

మహబూబాబాద్ టౌన్, మార్చి 8 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పలు రైల్వేస్టేషన్‌లలో ఈనెల 13వ తేదీన నుంచి మరికొన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంపీ మాలోతు కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు, మహబూబాబాద్, తడికలపుడి, బేతంపుడి రైల్వేస్టేషన్‌లలో నర్సాపూర్-నాగర్‌సోల్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర రైల్వేమంత్రితోపాటు ఉన్నతాధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేయడంతో ప్రయాణికుల సౌకర్యార్థం పలు స్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న గ్రీవెన్స్ సెల్ రద్దు

మహబూబాబాద్ టౌన్, మార్చి8 : కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌ను ఈనెల 11న రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన విధుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- కరెంట్ తీగెలు వేసి చేపలు పడుతుండగా ఘటన



రవి (ఫైల్)

నెల్లికుదురు, మార్చి 8 : చేపల వేటకు వెళ్లి, ఓవ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరువాగులో శుక్రవారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రత్తిరాం తండాకు చెందిన గుగులోత్ రవి (45), జామతండాకు చెందిన గుగులోత్ నరేష్, గుగులోత్ రవి ముగ్గురు కలసి బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరువాగులోకి మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లారు. వాగు సమీపంలోని విద్యుత్ స్తంభాల నుంచి డైరెక్టుగా కరెంట్‌ను తీసుకొని ఆ తీగెలను నీటిలో వేసి, చేపలు పడుతున్నారు. ఆ కరెంట్ తీగెలు గుగులోత్ రవికి తగడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టు మార్టం నిర్వహించినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

'హరీశ్‌రావు వ్యాఖ్యలు సరికావు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి8 : ఉద్యోగ, ఉపాధ్యాయులపై మాజీమంత్రి హరీష్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, వాటిని ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ-తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రఘురెడ్డి, మురళీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుబంధు నిధులు ఆపేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొదటి తారీకున జీతాలు చెల్లిస్తున్నారని చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కరోనా సమయంలోఉద్యోగ, ఉపాధ్యాయులు సగం వేతనం ఇచ్చినా సర్దుకున్నారని, అలా గత ప్రభుత్వానికి సహకరించిన ఉద్యోగులను ఇలా కించపరిచి మనోభావాలు దెబ్బతీయడం హరీశ్‌రావుకు తగదని హితవుపలికారు.

కమలం గూటికి సీతారాంనాయక్

ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మహబూబాబాద్ ఎంపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ


సీతారాంనాయక్‌తో భేటి అయిన కిషన్‌రెడ్డి

వరంగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్‌కు మరో భారీ షాక్ తగిలేలా ఉంది. ఆ పార్టీ సీనియర్ నేత, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నారు. శుక్రవారం వరంగల్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి స్వయంగా సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి సీతారాంనాయక్ కీలక పాత్ర పోషించారు. దీంతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. సీతారాంనాయక్ సేవలు గుర్తించి 2014లో మహబూబాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన సీతారాంనాయక్ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై పార్లమెంట్‌లో తరుచుగా గళమెత్తారు. అయితే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రొఫెసర్ సీతారాంనాయక్‌కు కేసీఆర్ బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించారు. దీంతో అప్పట్లోనే అసంతృప్తిగా ఉన్న సీతారాంనాయక్‌కు రాజ్యసభ, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టులను ఆశగా చూపించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని సీతారాంనాయక్ అధిష్ఠానాన్ని కోరారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌కు నిరాశే మిగిలింది. దీంతో కనీసం ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో మరోసారి మహబూబాబాద్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు కీలక నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే మహబూబాబాద్ నుంచి మరోసారి సిటింగ్ ఎంపీ మాలోతు కవితకే బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో తీవ్ర నిరాశలో ఉన్న సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.

పార్టీలోకి అహ్వానించిన కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. శుక్రవారం ములుగులో గిరిజన యూనివర్సిటీలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు ప్రారంభం చేసిన కిషన్‌రెడ్డి.. నేరుగా హనుమకొండలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి కలిశారు. సీతారాంనాయక్‌ను శాలువాతో సన్మానించి, బీజేపీలోకి రావాల్సిందిగా కిషన్‌రెడ్డి ఆహ్వానించారు. ఎస్టీల హక్కుల కోసం, గిరిజన యూనివర్సిటీ కోసం ఎంపీగా సీతారాంనాయక్ ఎంతో కృషి చేశారని, అందుకే శాలువాతో సన్మానించి, పార్టీలోకి అహ్వానించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు.

గౌరవం లేని చోట ఎందుకు ఉండాలి

తనకు బీఆర్‌ఎస్‌లో అనేక అవమానాలు జరిగాయని, కనీస గౌరవం కూడా లేదని మాజీ ఎంపీ సీతారాంనాయక్ పేర్కొన్నారు. గౌరవం లేని చోట ఎందుకు ఉండాలని, గౌరవించిన వాళ్ల దగ్గరికే ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. ఐదేళ్లుగా ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు పార్టీ బాధ్యతలు అడిగినా ఇవ్వలేదు.. సొంత ఖర్చులు పెట్టుకొని పార్టీ కాపాడుకుంటే కనీసం టికెట్ ఇవ్వకుండా అవమాన పర్చారని వాపోయారు. కుటుంబసభ్యులు, కార్యకర్తలతో చర్చించిన తరువాత బీజేపీలో చేరే విషయంపై కార్యాచరణ ప్రకటిస్తానని సీతారాంనాయక్ తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ

ముగిసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 8: ఆల్ ఇండి యా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థా యి పురుషుల ఓపెన్ టెన్నిస్ పోటీలు శుక్ర వారం ముగిశాయి. ముగింపు వేడుకలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై హోరాహోరీగా జరిగిన టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆఫీసర్ క్లబ్ వివిధ క్రీడలకు నిలయంగా మారిందని, మిగతా క్రీడాపోటీలకు దీటు గా ఓపెన్ టెన్నిస్ పోటీలను నిర్వహించినందుకు ఆఫీసర్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. విశిష్ట అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడు తూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచిన వారు పొంగకుండా ఓడిన వారు నిరాశ చెందకుండా పోటీతత్వంలో సాధన చేస్తే అనుకూల లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మట్లాడుతూ.. ఆరు రోజులుగా ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ పురుషుల టెన్నిస్ టోర్నమెంట్‌లో 10 రా ష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్ డబు ల్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ టోర్నిలో ఏజ్ కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సుమారు రూ.1లక్ష నగదు పారితోషికంతో పాటు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చే యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మురుగన్, రాష్ట్ర ఈసీ మెంబర్ బాబురెడ్డి, ఆర్గనైజింగ్ ప్రతినిధులు కన్నారెడ్డి, డాక్టర్ ప్రవీణ్, మనోహర్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● సింగిల్స్ విన్నర్స్: తరుణ్ కర్ర ప్రథమ స్థానం, ప్రత్యూష్ మహంతి ద్వితీయ స్థానంలో నిలిచారు.

● మెన్స్ డబుల్స్‌లో..: వినిత్ ముత్యాల, సాత్విక్ మురళి ప్రథమ స్థానం, కేఎస్ కవీన్ కార్తీక్, ప్రగతీష్ శివశంకర్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారు.

నేడు వర్సిటీకి పనిదినం

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ, ఇతర అనుబంధ కళాశాలలన్నీ మార్చి 9న శనివారం యథావిధిగా పనిచేస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా సెలవు ప్రకటించిన సందర్భంగా మార్చి 9న రెండో శనివారం పనిదినంగా ప్రకటించినట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలు, డిపార్టుమెంట్‌లకు, కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడించారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కల్యాణ మండంలో పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాలగుడి కల్యాణమండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టం అని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని కిషన్‌రెడ్డి శుక్రవారం వేద మంత్రాల మధ్య ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి, ఎంతో ఓర్పుతో, నైపుణ్యంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున్న దీనిని ఆ పరమశివుడికి అంకితమిస్తున్నానని అన్నారు. యావత్ ప్రజలకు పునరంకితం చేస్తున్నానని ప్రకటించారు. కాకతీయుల కాలం స్వర్ణయుగంగా ఆయన అభివర్ణించారు. ఒక చిన్న కల్యాణ మండపాన్ని విప్పి తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్లు పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని యేళ్లు పట్టి ఉండొచ్చోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి కట్టడాలను దర్శించి, అనుభూతి పొందినప్పుడు వాటి ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. అందువల్ల ప్రాచీన కట్టడాలను, కళాఖండాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాకతీయ రాజు రుద్రదేవుడు వేయిస్తంభాల గుడి కట్టడానికి 72 ఏళ్లు పట్టిందని, ఇలాంటి అనేక దేవాలయాలను నిర్మించడంలో అనుసరించిన ఇంజనీరింగ్ విధానం అద్భుతమని కొనియాడారు. హిందువులను తమ మతంలోకి మార్చుకోవడానికి 1320లో అప్పటి ముస్లిం పాలకులు ఒక ఎజెండాగా తీసుకొని ప్రణాళిక ప్రకారం లక్షలాది దేవాలయాలను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని, అలా ధ్వంసమైన వాటిలో పునరుద్ధరించిన వేయిస్తంభాలగుడిలో ప్రస్తుతం పునరుద్ధరించిన నందీశ్వరుడు కూడా ఉన్నాడన్నారు. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో వేయిస్తంభాల గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కల్యాణ మండపం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తికావడంపై దృష్టి పెట్టానని, ఆ మహాశివుడి ఆశీస్సులతో పూర్తి చేయగలిగామని అన్నారు. కాకతీయుల సాండ్‌బాక్స్ టెక్నాలజీనే ఉపయోగించి మరో వెయ్యేళ్లు నిలిచి ఉండేలా మండపాన్ని పునర్నించారన్నారు. మండపం పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన స్థపతి శివకుమార్ శ్రీనివాసన్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. నిట్ రిటైర్ ప్రొఫెసర్ పాండురంగారావు కృషి వెలకట్టలేనిదన్నారు. కేంద్రపురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు, సిబ్బంది మండపం పూర్తికి విశేష కృషి చేశారని కొనియాడారు.

కేంద్ర పురావస్తు శాఖ ప్రాచీన కట్టడాలను పరిరక్షించడంలో విశిష్టమైన పాత్రను పోషిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో అనేక కట్టడాలు ఏఎస్ఐ పరిధిలోకి రాగా, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో కేవలం ఏడు ప్రాచీన కట్టడాలు మాత్రమే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావలసిన ప్రాచీన కట్టడాలు ఇంకా అనేకం ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ ఏఎస్ఐ ఆధీనంలోకి తేవడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే కేంద్రపురావస్తు చట్టం చాలా కఠినంగా ఉంటుందని, ప్రాచీన కట్టడాలకు ఏ చిన్నమరమ్మతులు చేయాలన్నా, మార్పులు చేర్పులు జరపాలన్నా పలు అంక్షలు అడ్డువస్తాయన్నారు. పాండవుల గుట్టను ఏఎస్ఐ కిందకు తీసుకురావడానికి ప్రయత్నించగా అటవీశాఖ అభ్యంతరం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉన్న ప్రాచీన కట్టడాల నిర్వహణకు నిధుల కొరత కొంత అడ్డంకిగా ఉందన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధికి చాలినన్ని నిధులను ఇస్తామన్నారు.

శాసన మండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అనేక అపురూప కట్టడాలను ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. రామప్పలాగానే హనుమకొండ వేయిస్తంభాల గుడిని కూడా యునెస్కో పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఖిలా వరంగల్‌లోలాగానే వేయిస్తంభాల గుడిలో సౌండ్‌అండ్ లైట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా విలసిల్లిన ఓరుగల్లు.. కళలకు, కళాఖండాలకు కానాచి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిందన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, స్మార్ట్ సిటీ పథకం కింద నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాలను సమర్పించారు. కాగా, కల్యాణ మండపం పునర్నిర్మాణంపై కేంద్ర పురావస్తుశాఖ రూపొందించిన ఐదునిముషాల నిడివిని డిజిటల్ స్ర్కీన్‌పై ప్రదర్శించారు.

సత్కారం

కల్యాణ మండపం పునర్నిర్మాణంలో పనిచేసిన స్థపతి శివకుమార్, ఆయనతోపాటు పని చేసిన తమిళనాడుకు చెందిన శిల్పులకు శాలువాలు కప్పి పూలుచల్లి సత్కరించారు. మండపాన్ని పూర్వరూపానికి తీసుకురావడంలో భాగస్వాములైన నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, వన్నాల శ్రీరాములు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

శాంతిపూజ

మండపం ప్రారంభానికి ముందు కేంద్ర మంత్రి వేయిస్తంభాలగుడి ఆవరణలోని యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పూజలు జరిపారు.



కల్యాణ మండంలోకి వస్తున్న కిషన్‌రెడ్డి



వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో సమావేశమైన కార్పొరేటర్లు

ఎమ్మెల్యే నాగరాజుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల భేటీ

కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం

వరంగల్ క్రైం, మార్చి 8: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి ఆరుగురు కార్పొరేటర్లు వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. ఆరుగురిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలవడం గమనార్హం. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశామని కార్పొరేటర్లు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్‌లోకి జంప్ కావడం వాస్తవమని సమాచారం. ఇప్పటికే వీరికి ఎమ్మెల్యే నాగరాజు పలుమార్లు ఫోన్ చేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరాలని పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇటీవల రహస్య సమావేశం నిర్వహించుకున్నట్లు సమాచారం. పార్టీ మారాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మహిళా దినోత్సవం పేరిట ఎమ్మెల్యే నాగరాజును కలిసినట్లు సమాచారం. తనను కలిసిన కార్పొరేటర్లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కాగా ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలువడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నేత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, మార్చి 8: భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం సరికాదని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. మావోయిస్టుల లింకు కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించి వారిని విడుదల చేసింది. సాయిబాబా విడుదలను పురస్కరించుకొని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో హర్షాన్ని ప్రకటిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా మరొకరి సహాయం లేనిదే తనపని తాను చేసుకోవడం కూడా అసాధ్యమని అన్నారు. అలాంటి వ్యక్తిని పదేళ్లపాటు జైల్లో నెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రజా సంఘాల నాయకులు మెట్టు రవీందర్, అనిశెట్టి రజిత,రామలక్ష్మి, బి. రమాదేవి, ఎం.డి. బాసిత్, వెంగళ్‌రెడ్డి, బిల్లా మహేందర్, బోనగిరి రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

డిగ్రీ, పీజీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం ● 26 వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడి



ప్రవేశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, డైరెక్టర్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వివరాలను వెల్లడించారు.

డిగ్రీ మూడేళ్ల కోర్సుల్లో బీఏ హెచ్‌పీపీ, ఎస్‌పీపీ, బీకామ్ జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. అలాగే ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ సైకాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. డిప్లొమా కోర్సుల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మిమిక్రీ, వోకల్ మ్యూజిక్, ఇన్స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్‌స్కిల్స్, మీడియా ఫొటోగ్రఫీ కోర్సులున్నాయని వివరించారు. కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుంతో మార్చి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఫీజు, కోర్సు వివరాలు, ప్రవేశార్హతలు వర్సిటీ వెబ్ సైట్ హెచ్‌టీటీపీ://డీడీఈ.కేయూఅడ్మిషన్స్.ఓఆర్‌జీ/లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

కేయూ దూరవిద్యకేంద్రం తెలంగాణలో పెద్ద డ్యూయల్ మోడ్ వర్సిటీ అని వీసీ రమేశ్ చెప్పారు. గ్రామీణ, పట్టణ, ఉద్యోగార్థులు, పార్టుటైమ్ ఉద్యోగాలు చేసేవారికీ బాగా ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రత్యేక కాంట్రాక్టు తరగతులు, ఆన్‌లైన్, రేడియో తరగతులతోపాటు వివిధ మాధ్యమాలతో బోధన ఉంటుందని వెల్లడించారు. యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థలతోపాటు వర్సిటీ చట్టం మేరకు తరగతుల నిర్వహణతో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వవికాస తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ నేర్పిస్తామని వెల్లడించారు. ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఎప్పటికప్పుడూ వెబ్‌సైట్, సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారం అందుతోందని వెల్లడించారు. బ్రోచర్ విడుదల చేసినవారిలో కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి విద్యా వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ స్టాలిన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 8: భారతీయ జనతా పార్టీ విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ స్టాలిన్ మాట్లాడారు. విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెడుతోందని ఆరోపించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నూతన జాతీయ విద్యా విధానం ఉందన్నారు. ఎన్ఈపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ విఫలమైందన్నారు. ఎన్ఈపీ రద్దు కోసం ఏఐఎస్ఎఫ్ దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణతోపాటు ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ

హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడిని వేలాది మంది సందర్శించారు. స్వామివారికి మహారుద్రాభిషేకాలు జరిపారు. ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి, హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండలోనూ భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. వేయిస్తంభాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేయిస్తంభాల ఆలయం వెలుపల బారులుతీరిన భక్తులు

నేత్రపర్వంగా రుద్రేశ్వర కల్యాణం

వేయిస్తంభాల గుడిలో సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ఠ నక్షత్రయుక్త సింహలగ్న సుముహూర్తాన శ్రీ రుద్రేశ్వరీ రుద్రేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆగమ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, ఉత్సవమూర్తుల ఎదురుకోలు, బాషికధారణ, జిలకర బెల్లం, యజ్ఞోపవీత ధారణ,, మహా సంకల్పంలాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి కల్యాణోత్సవం తలంబ్రాల పర్వం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ కల్యాణ తంతును పర్యవేక్షించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆధాత్మిక వేత్తల పురాణ ప్రవచనంతో భక్త జనులు పులకించిపోయారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేసిన శ్రీరుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించారు. వేయిస్తంభాల ఆలయంలో జాగరణ చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పలు ఇతర ఆలయాల్లో..

వరంగల్ కోటలోని స్వయంభూ శంభులింగేశ్వరాలయం, వరంగల్ మట్టెవాడలోని భోగేశ్వరాలయం, భద్రకాళిగుడిలోని భద్రేశ్వర స్వామి ఆలయం, హనుమకొండలోని సిద్ధేశ్వరాలయం, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉజ్జయినీ మహాకాళేశ్వర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయం, ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని ఫణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలో ని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం సహా పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వరంగల్ రామన్నపేటలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆల యం, వరంగల్‌లోని దుర్గేశ్వర స్వామి ఆలయం, ఆత్మకూరు మండలం కటాక్షపురంలోని త్రికూటాలయం దామెర మండల కేంద్రంలోని దామేశ్వరాలయంతో సహ పలు ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి.

మంత్రుల పూజలు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడి, భద్రకాళి గుడిని, రామప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలోని పలు దేవాలయాలను సందర్శించి శివపూజలు చేశారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయం ఖిలావరంగల్‌లోని స్వయం భూ దేవాలయం తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం శివాలయాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ షా వేయిస్తంభాలగుడిని సందర్శించి పూజలు నిర్వహించారు.



ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం వద్ద బండారి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, పాల్గొన్న డీసీపీ, ఏసీపీ, ఈవోలు

శిగాలూగిన మల్లన్న క్షేత్రం

ఐనవోలు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవక్షేత్రంలో పరమశివుడి సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అభిషేకాలు కొనసాగాయి. భక్తులు మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామి వారికి సింహవాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు ఉదయం 8 గంటలకు సింహవాహనసేవలో(స్వామి వారిని) మాడవీధుల గుండా ఊరేగించారు. యాగశాలలో రుద్రహోమాలు అష్టోత్తర 108 కలశాల్లో నదీసముద్రజలాలు, సుగంధ ద్రవ్యాలు, అభిషేక ద్రవ్యాలు ఉంచి నాలుగు కాలముల్లో పూజించారు. ఈ కలశాలతో లింగోద్భవకాలంలో మహాభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ నందివాహన సేవను నిర్వహించారు. ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణాలు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపం)ను 12 అడుగుల వెడల్పు, పొడువుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాథను పఠించారు. తదుపరి భక్తి పారవశ్యంతో పట్నంపై మైమరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్ నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. భక్తులు నృత్యాలు చేయడానికి చూడటానికి మండపం వద్ద పోటీ పడి నెట్టుకున్నారు.

కమనియం మల్లన్న స్వామి కల్యాణం

ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండుగగా కనువిందు చేసింది. భ్రమరాంబమల్లికార్జునస్వామి వారిని నంది వాహనంపై నాలుగు వీధుల్లో కనువిందు చేసి కల్యాణ మండపానికి తీసుకవచ్చారు. వేద మంత్రోచ్ఛరణ నడుమ శైవాగమ శాస్త్రోక్తంగా యాగ్నికులు శ్రీనివాస్‌కుశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, పురోహిత్ ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితుడు పురుషోత్తంశర్మ, విక్రమ్ జోషి, యాగ్నికులు శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం కల్యాణం జరిపారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తీసుకవచ్చారు. పట్టువస్త్రాలు, ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికు చేరుకున్నాక సుమారు 2గంటల పాటు కల్యాణం నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో అసాంతం తన్మయతతో తనివితీరాస్వామిని సేవించి భక్తిని చాటుకున్నారు. కల్యాణంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కూతురు దివ్యరాజ్, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుగౌడ్, మోహన్‌గౌడ్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, రాయపురం సాంబయ్య, అనుముల రవీందర్, పల్లకొండ రమేష్, గిరుక రాజు, రాజిరెడ్డి, ఐనవోలు గ్రామ పురప్రముఖులతోపాటు ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు కల్యాణ తంతులో పాల్గొన్నారు.



తాళి చూపిస్తున్న దృశ్యం


బయ్యారం సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు


నర్సింహులపేటలోని రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..


డోర్నకల్‌లోని శివకేశవ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కంబాలపల్లి రాజరాజేశ్వరి ఆలయంలో మోకాళ్లతో..


కాట్రపల్లి శివకోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

శివోహం

(5వ పేజీ తరువాయి)

రఘురాంశర్మ, భక్తులు పాల్గొన్నారు.

● అబ్బాయిపాలెం శివారు అగస్త్యేశ్వరస్వామి గుట్టపై, తాళ్లఊకల్, రాంపురం, ఎల్లంపేటల్లో భక్తులు పూజలు చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, తల్లాడ లక్ష్మీకాంత్, తల్లాడ వెంకటరామారావు, రాయల రవి పాల్గొన్నారు.

● దంతాలపల్లి, పెద్దముప్పారం, దాట్ల, రేపోనిలో శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ యాకయ్య, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు సుష్మిత, రవీందర్ పాల్గొన్నారు.

● నర్సింహులపేట మండల కేంద్రంలో రాజరాజేశ్వరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. శివపార్వతులకు కల్యాణం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నవజ్జుల సూర్యప్రకాష్‌శర్మ, ప్రధాన అర్చకులు దేవేంద్రశర్మ, మాజీ చైర్మన్ బొల్లం రమేష్, గౌని ఉపేందర్, చౌడరపు శ్రీనివాస్, రవి, జగదీశ్వర్, బండి రమేష్ పాల్గొన్నారు.

● తొర్రూరులో మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు పోటెత్తారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లిం చుకున్నారు. పట్టణంలోని పాటిమీదిగల రామలింగేశ్వర ఆలయం, సొరంగేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

● గార్ల శివాలయంలో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్రిగూడెం శివాలయంలో భక్తులు పూజలు చేశారు. పుల్లూరులోని కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయంలో శివపార్వతుల కన్నుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ భట్టు నాగరాజు, ఎంపీటీసీలు శీలంశెట్టి రమేష్, గుండెబోయిన నాగమణి, మాజీ సర్పంచులు అజ్మీర భస్సీలాల్, భూక్య బుజ్జి పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. మున్నేరు ఒడ్డున శివకేశవక్షేత్రం (పంచముఖ లింగేశ్వరస్వామి) ఆలయం, అమ్మపాలెం, పెరుమాండ్ల సంకీస, వెన్నారంలో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కొత్తగూడ మండలం గుండం రామలింగేశ్వర ఆలయంకు భక్తులు పెద్ద సం ఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

● నెల్లికుదురు మండలం శ్రీరామగిరి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, రావుల సతీష్, డోనికెన జ్యోతి, శ్రీనివాస్, బెల్లి నర్సయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

● గూడూరు సనాతన శివాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి రాత్రి నిర్వహించిన శివపార్వతుల కల్యాణాన్ని వీక్షించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, బొల్లికొండ మధు, నగేష్‌రెడ్డి, కొమ్మాలు, శివ పాల్గొన్నారు.

● కేసముద్రం మండలం ధనసరి మల్లన్నగుట్టపై, కాట్రపల్లి శివకోటేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, మాజీ జడ్పీటీసీ కదిరే సురేందర్, బండారు వెంకన్న, ఎంపీటీసీ ధరావత్ బాలు, కొండ సురేష్ పాల్గొన్నారు.

● బయ్యారం శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలిం గానికి ఆలయపూజారి అభిషేకం నిర్వహించారు. 17వ వార్షికోత్సవాన్ని పురస్కరిం చుకుని బయ్యారం శిరిడీసాయిబాబా ఆలయంలో సాయిసేవకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయివ్రతంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మండల వ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

19 ఏళ్లుగా మోకాళ్లపై వెళ్లి దైవ దర్శనం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన తుప్పతూరి మల్లయ్య గత 19 ఏళ్లుగా గ్రామశివారులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంపైకి మోకాళ్లపై నడుచుకుంటూ దైవదర్శనం చేసుకుంటున్నారు. 2005లో దేవాలయ సమీపంలో ఉన్న తన వ్యవసాయ భూమిలో 2005 అక్టోబరులో మిర్చిపంటలో మల్లయ్య, యాదమ్మ దంపతులు కలుపు తీస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుండడంతో వారు పంటక్షేత్రంలో ఉన్న తాటిచెట్టు కిందకు వెళ్లారు. ఒక్కసారిగా ఆ తాటిచెట్టుపై పిడుగుపడి తాటిచెట్టు మొత్తం కాలిపోయిందని చెప్పారు. ఆ దంపతులకు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడడంతో మల్లయ్య నాటి నుంచి నేటి వరకు ప్రతి శివరాత్రి రోజున దేవాలయం వద్దకు చేరుకుని మెట్ల ద్వార మోకాళ్లపై నడుచుకుంటూ వెళ్లి దైవదర్శనం చేసుకుంటున్నారు.

● కంబాలపల్లి గ్రామ శివారు పెద్దచెరువు సమీపంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. పెళ్లిపీటలపై కంబాలపల్లి గ్రామానికి చెందిన దిడ్డి మహేందర్-మానస దంపతులు, గార్లపాటివెంకటనారాయణ-ప్రభావతి దంపతులు కూర్చోని శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో గ్రామ మాజీ సర్పంచ్ సంద వీరన్న, చీరిక వేణురెడ్డి, ముత్యాల వెంకన్న, సజ్జన వెంకన్న, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, రవీందర్, సురేష్, శ్రీకాంత్, కృష్ణ, అర్చకులు లోకేష్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

కేసముద్రం, మార్చి 8 : మండలంలోని కోరుకొండపల్లి సమీపంలో మూల మలుపు వద్ద శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో గూడూరు మండలం అప్పరాజుపల్లికి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పరాజుపల్లి నుంచి పది మంది ప్రయాణికులతో ఆటోలో కేసముద్రం మీదుగా కొమురవెల్లి జాతరకు వెళుతున్నారు. కోరుకొండపల్లి సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటో ప్రయాణిస్తున్న అప్పరాజుపల్లికి చెందిన మన్యం మల్లేష్, సురాంబ, శిరీష, వీరయ్య, లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

చింతచెట్టు పైనుంచి పడి ఒకరి మృతి


రహీమొద్దీన్ (ఫైల్)

కేసముద్రం, మార్చి 8 : మండలంలోని కల్వలలో శుక్రవారం చింతచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో ఎండీ.రహీమొద్దీన్ (55) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో చింతకాయలు తెంపేందుకు చింతచెట్టు ఎక్కగా, ప్రమాదవశాత్తు జారి చెట్టుపైనుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అయన్ను జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య సలీమా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు మృతి


ఆదిత్య (ఫైల్)

తొర్రూరు, మార్చి8 : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం తొర్రూరుకు చెందిన బొమ్మగాని నర్సయ్య కుమారుడు ఆదిత్యగౌడ్ (20) గురువారం మధ్యాహ్నం తన అన్న ప్రవీణ్ వివాహం జరిగింది. సాయంత్రం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ముగిసిన తర్వాత రాత్రి 12 గంటలకు పెట్రోల్ కోసం బంక్‌వైపు వెళ్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఢీకొట్టిన వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం తనఅన్న పెళ్లి ముగిసి ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొని అప్పటి వరకు స్నేహితులు, కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపిన వ్యక్తి మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉత్సాహంగా పెళ్లి వేడుకల్లో పాల్గొని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడి తండ్రి బొమ్మగాని నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎస్‌జీఎఫ్ సహాయం

కేసముద్రం, మార్చి 8 : మండలంలోని కల్వలలో ఇటీవలె మృతి చెందిన చుక్క ఎల్లయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని సమ్మిగౌడ్ ఫౌండేషన్(ఎస్‌జీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. అనంతరం ఇదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఏదునూరి లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, కాంగ్రెస్ నాయకుడు దామరకొండ ప్రవీణ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మూరగుండ్ల అనంతరాములు, మోడెం వెంకటేశ్వర్లు, పెదగాని రవి, కొంతం శ్రీనివాస్, పొడేటి దినేష్, చంద్రం పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

నర్సింహులపేట, మార్చి 8 : గ్రామీణ క్రీడలకు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతోపాటు క్రీడాకారులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ అన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్రి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు దాసరోజు రాజశేఖర్,యూత్ అధ్యక్షుడు చిర్ర సతీష్, పీఏసీఎస్ డైరెక్టర్ రజినీకాంత్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, వెంకట్‌రెడ్డి, బండ శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కదుదుల రామక్రిష్ణ, రాజీవ్‌యూత్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● జడ్జి మట్ట సరిత

తొర్రూరు, మార్చి 8 : నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి సంస్థ చైర్మన్ మట్ట సరిత సూచించారు. గురువారం సాయంత్రం తొర్రూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ, టెక్నాలజీకి అనుగుణంగా ముందుకు నడవాలన్నారు. ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లినపుడే గుర్తింపు ఉంటుందని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ప్రతీ ఒక్కరు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన మహిళా న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లాలు, ఏపీపీ ప్రవీణ్ రాజు, ప్రాసిక్యూటర్ గణేష్, ఆనంద్ ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

● కురవి వీరభద్రుడి ఆలయంలో..


వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ సుధీర్‌రాందాస్


స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


పూజలు జరుపుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవి, మార్చి 8 : మహాశివరాత్రి రోజు కురవి ఆలయం భక్తులతో నిండిపోయింది. వీరభద్రస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. క్యూలైన్లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. ఉదయం 4 గంటల నుంచే ఆలయంలో పూజాకార్యక్రమాలు మొదలై, స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. 4 నుంచి సాయంత్రం 4గంటల వరకు స్వామివారికి పూర్ణాభిషేకం నిర్వహించారు. ఈ పూజాకార్యక్రమాన్ని నిర్వహిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని నానుడి.. ఈపూజ చేయించుకునేందుకు భక్తులు పోటీలు పడ్డారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు బంగారు కిరీటాలను అమర్చారు. భక్తులకు బంగారు కిరీటాల్లో భద్రకాళి సమేత వీరభద్రుడు దర్శనమిచ్చాడు.

పల్లకీలో ఊరేగింపు..

స్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని అర్చకులు ఆలయంలో ఊరేగించారు. పల్లకిలో ప్రదక్షిణలు చేయించారు. అమ్మవారిని సైతం పల్లకిలో ఊరేగించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చనలు, పూజాకార్యక్రమాలు కొనసాగాయి.

వీరభద్రుడు పెళ్లికొడుకాయనే..

వీరభద్రస్వామి పెళ్లిగడియలు దగ్గరపడ్డాయి.. కోరమీసాల ఉగ్రరూప వీరభద్రుడు పెళ్లికొడుకయ్యాడు. శుక్రవారం ఉదయం వీరభద్రస్వామికి మంగళస్నానాలు చేయించిన అర్చకులు, వేద మం త్రోచ్ఛరణల నడుమ పట్టువస్త్రాలు కట్టించి పెళ్లికొడుకును చేశారు. అమ్మవారిని సైతం పెళ్లికూతురుని చేశారు.

'గిరిజనులకు అత్యున్నత విద్య'


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ములుగు, మార్చి8 : దేశంలోని గిరిజనులందరినీ వందశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, అత్యున్న విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం కృషిచేస్తోందని, ఇందుకోసం ప్రత్యేక పథకాలను అమలుచేస్తూ ఆర్థిక, సామాజిక, విద్యారంగాల్లో ప్రోత్సాహన్నందిస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు కేటాయించిన ప్రతిష్టాత్మక సమ్మక్క, సారలమ్మ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ములుగు ప్రాంతానికి తలమానికం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక యువతకు విద్య ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. యూనివర్సిటీ కోసం ములుగు మండలం జాకారంలోని వైటీసీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఓఎస్డీగా నియమితుడైన వంశీకృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించి అభినందించారు. అనంతరం వైటీసీ ఆవరణలో జరిగిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 49శాతం గిరిజనుల అక్షరాస్యత ఉందని, మహిళల్లో 39శాతంగా ఉందన్నారు. గిరిజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ యూనివర్సిటీ దోహదపడుతుందని తెలిపారు. భూసేకరణ, బదలాయింపు ప్రక్రియలో జాప్యం కారణంగా యూనివర్సిటీ ఏర్పాటు ఆలస్యమైందన్నారు. సేకరించిన 335 ఎకరాల్లో 50ఎకరాలకు అటవీశాఖ క్లియరెన్స్ రావాల్సి ఉందని, త్వరగా పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వర్సిటీ నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం రూ.889 కోట్లను కేటాయించిందని అన్నారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. తొలుత బీఏ ఇంగ్లీష్, బీఏ సోషల్ సైన్స్ సబ్జెక్టులను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. గిరి జనులకు 7.5 శాతం రిజర్వేషన్‌తోపాటు 33శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయిస్తారని తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో ఎక్కువ మందికి ప్రవేశం లభించేలా చర్యలు తీసుకుంటామన్నా రు. డీపీఆర్, టెండర్ ప్రక్రియ పూర్త యితే త్వరలోనే భూమిపూజ కార్యక్ర మానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తా రని వెల్లడించారు. ఈ విశ్వవిద్యాలయంలో గిరిజనుల సంస్కృతి, జీవన విధానం, కళల, సంప్రదాయ మూలికా వైద్యంపై పరిశోధనలు జరిపి నిక్షిప్తం చేస్తూ తద్వారా భవిష్యత్ తరాలకు అందించనున్నట్టు తెలిపారు. వర్సిటీకి సమ్మక్క, సారలమ్మ పేరును ప్రతిపాదించగానే పీఎం మోదీ ఒప్పుకున్నారని, ఆరాధ్యదైవాలైన వనదేవతల పేరిట గొప్ప విద్యాసంస్థ ఏర్పాటు కావడం గర్వకారణమని తెలిపారు.

నిర్వహణ బాధ్యత హెచ్‌సీయూది

ట్రైబల్ వర్సిటీ నిర్వహణ బాధ్యతను కొంతకాలం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెంటార్‌గా వ్యవహరిస్తుందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అడ్మిషన్, అడ్మినిస్ట్రేషన్ ప్రక్రియ అంతా వారే పర్యవేక్షిస్తారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నియామకం జరుగుతుందని తెలిపారు. ఈ యూనివర్సిటీలో గిరిజన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా యూనివర్సిటీని కాపాడుకోవాలని, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దీంతో ఈ ప్రాంతం పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతుందని, స్థానిక యువకులు ఎక్కువ మంది యూనివర్సిటీలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పర్యాటకాభివృద్ధి సహకారం

ములుగు ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను కేంద్రం నిధులతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఏడు ప్రదేశాల్లో అభివృద్ధి, సుందరీకరణ జరిగిందన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ స్థాపనతో ఈ ప్రాంతం పురోగతి సాధిస్తుందని ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక చారిత్రక కట్టడం రామప్ప దేవాలయం కావడం విశేషమని, ఇందుకోసం మోదీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు రూ.65కోట్లతో విస్తృతంగా సదుపాయాలను కల్పించడం జరుగుతోందని తెలిపారు.

ఎడ్యుకేషన్, టూరిజం హబ్‌గా ములుగు
- రాష్ట్రమంత్రి సీతక్క

అద్భుతమైన ప్రకృతి రమణీయ, చారిత్రక ప్రదేశాలున్న ములుగును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్రమంత్రి సీతక్క కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయ స్థాపనతో ఈ ప్రాంతవాసులకు ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడ్డాయని తెలిపారు. 2014లో విభజన చట్టంలో మంజూరైన యూనివర్సిటీ ఏర్పాటుకు పదేళ్లకాలం పట్టిందని, ఈ క్రమంలో అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొని ములుగులో నిర్మించేలా దివంగత మాజీమంత్రి అజ్మీరా చందూలాల్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ కృషి చేశారన్నారు. కోర్సుల సంఖ్యను పెంచాలని, ఎక్కువ మంది గిరిజన విద్యార్థులకు అడ్మిషన్‌లు దక్కేలా రిజర్వేషన్‌ను పెంచాలని కోరారు.

పార్లమెంట్‌లో కొట్లాడాం : ఎంపీ కవిత

తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం పార్లమెంట్‌లో కొట్లాడటం జరిగిందని, అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. సుదీర్ఘ ప్రయత్నం తర్వాత యూనివర్సిటీని సాధించుకోవడం గర్వంగా ఉందన్నారు. గిరిజనుల పేరిట ఏర్పాటు చేస్తున్న యూనివర్సిటీలో గిరిజనులకు ఎక్కువ సీట్లు కేటాయించాలని కోరారు. కాగా, శిలాఫలకంపై ఎంపీగా తనపేరు లేకపోవడంపై కవిత అసహనం వ్యక్తంచేశారు. అయితే.. ఈ అంశాన్ని వివాదం చేయదల్చుకోలేదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారాం, ట్రైబల్ వర్సిటీ ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ హనుమంతరావు, ఐటీ డైరెక్టర్ సంజయ్ కుమార్ శర్మ, సిస్టం అనాలసిస్ట్ మహ్మద్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

● పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

మహబూబాబాద్ రూరల్, మార్చి 8 : కేంద్రప్రభుత్వ మహిళ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకుందామని ప్రగతిశీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని భట్టు అంజయ్య భవనంలో ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏదో ఒకచోట మహిళలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్డీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, పద్మ, రజిత, రమణమ్మ, స్నేహబిందు, సోమక్క, యాకూబ్, కవిత, అనిత, సునీత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు, చైర్మన్ పదవీకి రాజీనామా చేయాలి

తొర్రూరు, మార్చి 8 : మాజీమంత్రి దయాకర్‌రావు భిక్షతో కారుగుర్తుపై మునిసిపల్ చైర్మన్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు తక్షణమే బీఆర్‌ఎస్ పార్టీకి, చైర్మన్ పదవీకి రాజీనామా చేయాలని జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తొర్రూరులోని 6వ వార్డులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవుల కోసం రాజకీయంగా దిగజారడం సరికాదన్నారు. ప్రైవేటు స్కూల్‌లో పనిచేస్తూ సాధారణ కార్యకర్తగా ఉన్నవ్యక్తిని దయాకర్‌రావు కౌన్సిలర్‌తో పాటు చైర్మన్‌ను చేస్తే డబ్బుకు అమ్ముడుపోయి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని అన్నారు. నాయకులు ఆర్. వెంకన్న, కుర్ర శ్రీను, జైసింగ్, వినయ్, సుధాకర్, అనిల్, రాజు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ పమిడిపడిగ జాతర కమిటీ ఎన్నిక

కొత్తగూడ, మార్చి 8 : కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామంలో ఎప్రిల్ 24నుంచి 26 వరకు నిర్వహించే శ్రీశ్రీశ్రీ పమిడిపడిగ సడలమ్మ పెదవేలుపు జాతర నిర్వహణ కమిటీని శుక్రవారం తలపతులు ధనసరి సారయ్య, జంపయ్య, వడ్డె దారం సమ్మయ్య ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపతి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మంకిడి లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడిగా ఆగబోయిన రవి, కోశాధికారిగా మంకిడి సతీష్, కార్యదర్శిగా ఐలబోయిన సతీష్, ప్రచార కార్యదర్శులుగా జబ్బ రామారావు, ఈక అశోక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐలబోయిన లక్ష్మయ్య, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకరమహేశ్వర స్వామికి బోనాలు

గార్ల మార్చి 8 : మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా గార్ల మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకరమహేశ్వర స్వామికి బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గౌడ సంఘం కార్యాలయం నుంచి మహిళలు పెద్దఎత్తున బోనాలు ఎత్తుకొని పట్టంలోని పలు విధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దఉన్న శ్రీకరమహేశ్వర స్వామి దేవాలయానికి చేరుకొని దేవతామూర్తులకు వైభవంగా మొక్కులను చెల్లించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కందునూరి శ్రీనివాస్, తోడేటి శ్రీనుగౌడ్, ఈశ్వరలింగ్, మోత్కురి వెంకటరాజ్యం, మోత్కురి రమేష్‌గౌడ్, కోలా కుమార్‌గౌడ్, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, మోటపోతుల రాంబాబు, కత్తి శివగౌడ్ పాల్గొన్నారు.

రైతాంగానికి కేంద్రం ఇచ్చిన హామీలను నేరవేర్చాలి

● ఎస్‌కేఎం జిల్లా నాయకుడు జగ్గన్న

మహబూబాబాద్ రూరల్, మార్చి 8 : రైతాంగానికి ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనింగ్ కమిటీ నాయకుడు జగ్గన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి భారతీయ జనతా పార్టీ మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలైన రైతు విముక్తి చట్టం, కనీస మద్దతు ధర చట్టం, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. రైతాంగ ఉద్యమంలో అమరులైన 763 మంది రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం, విద్యుత్ సవరణ లాంటి చట్టాలను వెనక్కి తీసుకోవడం లాంటి హామీలను నేటికి అమలు చేయలేదని జగ్గన్న ఆరోపించారు. మార్చి 9 నుంచి 13 వరకు అన్నిమండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు, 14న కలెక్టరేట్‌ల ముందు ధర్నాను చేపట్టనున్నట్లు చెప్పారు. నల్లపు సుధాకర్, గుజ్జు దేవేందర్, గునిగంటి రాజన్న, సక్రు, తాజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.